సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ. 24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 245 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/21.5°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పోలీసు 'స్పందన'కు 16 అర్జీలు



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి వివిధ సమస్యలపై 16 అర్జీలు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఒక్కో అర్జీదారుతో ఓపికగా మాట్లాడి వారి సమస్య తెలుసుకున్నారు. కొన్నింటిపై అప్పటికప్పుడే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీల్లో అత్యధికంగా రోడ్డు సమస్యలు, కుటుంబ తగాదాలవే ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 'స్పందన'లో అర్జీలు సమర్పించే ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, లీగల్ అడ్వయిజర్ సాయినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు నల్లమాడలో 'స్పందన'

- మండల కేంద్రాల్లోనూ ప్రతి బుధ, శుక్రవారాల్లో కార్యక్రమం

పుట్టపర్తి అర్బన్: ప్రజల సౌకర్యార్థం ఇక నుంచి ప్రతి బుధ, శుక్ర వారాల్లో మండల కేంద్రాల్లోనే 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించిన విధంగానే మండల కేంద్రాల్లోనూ స్పందన ఉంటుందన్నారు. ఇందులో ఏ మండలంలో 'స్పందన'నిర్వహిస్తే మండలానికి చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈనెల 13వతేదీ (బుధవారం) నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వారానికి రెండు సార్లు స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యా ప్రణాళికలో సమూల మార్పులు



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానం–2020 మేరకు డిగ్రీ కోర్సు విద్యా ప్రణాళికలో సమూల మార్పులు చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూలోని పాలిమర్ సైన్సెస్ విభాగంలో సోమవారం అనుబంధ డిగ్రీ కళాశాలల బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్, మైనర్ డిగ్రీ సబ్జెక్టులు, డిగ్రీ ఆనర్స్, డిగ్రీ ఆనర్స్ విత్ రీసెర్చ్‌లకు సంబంధించిన అన్ని సబ్జెక్టుల సిలబస్ గురించి వీసీ రామకృష్ణారెడ్డి చర్చించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి, రెండో సెమిస్టర్ సిలబస్ రూపకల్పన పకడ్బందీగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ రాంగోపాల్ పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'కు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: చేతివృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి జీవన ప్రమాణాలు పెంపునకు కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనివారు, బుట్టలు అల్లేవారు, పూల దండలు అల్లేవారు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వలలు తయారీదారులు అర్హులు. దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో స్టైఫండ్ ఇస్తారు. శిక్షణ పూర్తి కాగానే సర్టిఫికెట్‌తో పాటు రూ.15 వేలు విలువ చేసే టూల్‌కిట్ అందజేస్తారు. అనంతరం విడతల వారీగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పిస్తారు. పూర్తి వివరాల కోసం జిల్లా పరిశ్రమల శాఖ, డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులను సంప్రదించవచ్చు.

ఇబ్బంద్ లేదు!

బస్సులు యథావిధిగా తిరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలన్నీ కొనసాగాయి. చాలా వరకు పాఠశాలలూ నడిచాయి. సోమవారం కావడంతో వివిధ పనుల మీద వచ్చిన జనంతో పట్టణాలు, మండల కేంద్రాలు కిటకిటలాడాయి. ఫలితంగా టీడీపీ బంద్ పిలుపునకే పరిమితమైంది.

- టీడీపీ బంద్‌కు స్పందన కరువు
- యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు
- పనిచేసిన బ్యాంకులు, ప్రైవేటు కార్యాలయాలు
- ప్రభుత్వ కార్యకలాపాలు యథాతథం
- ముందస్తు చర్యగా బందోబస్తు నిర్వహించిన పోలీసులు

సాక్షి, పుట్టపర్తి



హిందూపురంలోని బస్టాండు సమీపంలో రద్దీగా ఉన్న కూడలి

టీడీపీ బంద్‌కు... స్పందన కరువైంది. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లగా...టీడీపీ అధిష్టానం సోమవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. అయితే దాన్ని జనంతో పాటు కార్యకర్తలు పెద్దగా పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యకలాపాలన్నీ యథావిధిగా నడిచాయి. ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కాయి. ప్రయాణికులు ప్రశాంతంగా రాకపోకలు సాగించారు. కలెక్టరేట్, పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'కార్యక్రమానికి ఫిర్యాదుదారులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు సాయంత్రం వరకు సాఫీగా సాగాయి. ఉద్యోగులందరు వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అయితే అక్కడక్కడా కొందరు టీడీపీ నేతలు ఫొటోలకు ఫోజులిచ్చేందుకు హంగామా చేసేందుకు ప్రయత్నించినా పెద్దగా స్పందన కనిపించలేదు. మెజారిటీ జనం... 'చంద్రబాబు తప్పు చేశాడు, జైలుకెళ్లాడు' అన్న భావనతో ఉన్నట్టు కనిపించింది. నాలుగున్నరేళ్లుగా ప్రజా సమస్యలు పట్టని టీడీపీ నేతలు నేడు బంద్‌కు పిలుపునిస్తే ఎలా సహకరిస్తారని ప్రజలు మండిపడ్డారు. ఇక బంద్‌కు మద్దతిచ్చిన జనసేన ప్రభావం జిల్లాలో ఇసుమంతైనా కనిపించకపోవడం గమనార్హం.

యథావిధిగా బస్సులు.. షాపులు..

జిల్లాలోని అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరిగాయి. ప్రయాణికులకు ఎక్కడా ఇబ్బందిలేకుండా బస్సులు తిప్పినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రోజులాగే బస్సులు తిరగడంతో బంద్ ప్రభావం కనిపించ లేదు. అంతేకాదు ప్రతి మండల కేంద్రంలో షాపుల నిర్వహణ యథావిధిగా కొనసాగింది. పుట్టపర్తి, హిందూపురం, కదిరి, పెనుకొండ తదితర పట్టణాల్లో ఉదయం 9 గంటల నుంచే షాపులు తెరవడంతో ఎక్కడా వ్యాపారానికి ఇబ్బంది కనిపించలేదు. మరోవైపు బ్యాంకులన్నీ పనిచేయడంతో ఆర్థిక లావాదేవీలకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మరోవైపు ప్రైవేటు సంస్థలు, కంపెనీల్లోనూ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. పారిశ్రామిక వాడల్లోనూ కార్మికులు ఎప్పటిలాగే విధుల్లో పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు..

'టీడీపీ బంద్'ప్రభావం ఎక్కడా కనిపించనప్పటికీ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవ్‌రెడ్డి పలు ప్రాంతాల్లో నేరుగా వెళ్లి పర్యవేక్షించారు.

నేతల ఓవరాక్షన్..

బంద్‌కు జనం నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో టీడీపీ నేతలు అక్కడక్కడా ఓవరాక్షన్ చేశారు. పోలీసులు ముందస్తుగా పరిటాల శ్రీరామ్‌ను హౌస్ అరెస్టు చేయగా, అతను భవనం వెనుక భాగంలో పైనుంచి కిందకు దిగి ద్విచక్ర వాహనం మీద బయటికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అంతలోపు పోలీసులు ఆయన్ను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి సోమవారం ఉదయమే అరకొర జనంతో జాతీయ రహదారిపై బైఠాయించేందుకు ప్రయత్నించి నవ్వులపాలయ్యారు. ఐదారుగురితో హైవే ముట్టడించే ప్రయత్నం చేయడం చూసి జనం నవ్వుకున్నారు. హిందూపురంలో మైనర్ బాలురు కొంతమంది గుంపుగా చేరి టైర్లు కాల్చి రచ్చ చేశారు. అయితే పోలీసులు రంగంలోకి దిగే సరికి పత్తా లేకుండా పారిపోయారు. రామగిరిలో రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రి పరిటాల సునీతను పోలీసులు రామగిరి స్టేషన్‌కు తరలించారు.



పుట్టపర్తి నుంచి కదిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు



కదిరి బస్టాండు నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులు



హిందూపురంలో యథావిధిగా తెరుచుకున్న పండ్ల దుకాణాలు

బస్సు అద్దాల ధ్వంసం

- టీడీపీ నేతల అరెస్ట్



ఆర్టీసీ బస్సు అద్దాలు పగలగొట్టిన దృశ్యం

పరిగి: టీడీపీ బంద్ పిలుపు నేపథ్యంలో పరిగిలో ఆ పార్టీ నేతలు కొందరు ఆర్టీసీ బస్సు అద్దాన్ని ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు పరిగి మండల కేంద్రంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమ వద్ద కార్మికులు విధులకు వెళ్లకుండా అడ్డుకోగా, హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ నేతృత్వంలో పోలీసులు ఆందోళన కారులతో మాట్లాడుతున్న క్రమంలోనే కొందరు రొద్దం నుంచి హిందూపురానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అద్దాన్ని రాయితో పగలగొట్టారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులపై అద్దం గాజు ముక్కలు పడ్డాయి. కొందరికి గాయాలు కాగా, డీఎస్పీ కంజాక్షన్, సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ నరేంద్ర టీడీపీ నేతలను చెదరగొట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేసిన టీడీపీ నాయకులను, పార్టీ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సహకార బ్యాంక్ పేదలది

- ఎంపీ గోరంట్ల మాధవ్
- సైదాపురంలో నూతన శాఖ ప్రారంభం



ఖాతాదారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంపీ గోరంట్లమాధవ్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత

కదిరి అర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) సంపూర్ణంగా పేదలకు చెందినదేనని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. కదిరిలోని సైదాపురం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో బ్యాంక్ నూతన శాఖను ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డితో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలఅభ్యున్నతికి బ్యాంక్ ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. బ్యాంక్ సేవలను అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా బలపడాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 28 బ్రాంచ్‌లతో నడుస్తున్న డీసీసీబీ... ప్రభుత్వ పథకాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తోందని చైర్‌పర్సన్ లిఖిత అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ రూ.1,700 కోట్లకు బ్యాంక్ లావాదేవీలు చేరుకున్నాయన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.110 కోట్ల టర్నోవర్‌తో కదిరి బ్రాంచ్ అన్నింటా ముందంజలో ఉండడంతో హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బ్యాంకు సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఖాతాదారులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈఓ రాంప్రసాద్, డీజీఎం సుఖ్‌దేవ్‌బాబు, డీసీసీబీ మేనేజర్ వెంకటాచలం, డైరెక్టర్ హైదర్‌వలీతో పాటు పలు సొసైటీల అధ్యక్షులు, సీఈఓలు పాల్గొన్నారు.

జన జీవనం యథాతథం



ధర్మవరంలో పర్యటిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం



ముదిగుబ్బలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

- డీఐజీ అమ్మిరెడ్డి

ధర్మవరం అర్బన్ /పుట్టపర్తి అర్బన్: టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చినా జిల్లాలో జనజీవనానికి ఇబ్బంది కలగలేదని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ధర్మవరం పట్టణంలో పర్యటించారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంతో కలిసి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పర్యటించారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఐజీ మాట్లాడారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగలేదన్నారు. బంద్ ప్రభావం కనిపించనప్పటికీ ముందస్తు చర్యల్లో భాగంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు ఎస్పీ మాధవరెడ్డి పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, కదిరి, ప్రాంతాల్లో పర్యటించారు. భద్రతా చర్యలపై ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ ప్రజా రవాణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పట్టణాలతో పాటు ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. రహదారుల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉండడంతో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరింపజేశారు.

108లో ప్రసవం



నవజాత శిశువును చూపుతున్న 108 సిబ్బంది

అమరాపురం: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు.. అమరాపురం మండలం కె.శివరం గ్రామానికి చెందిన గర్భిణీ సంగీతకు సోమవారం సాయంకాలం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబీకులు ఫోన్ చేయగా, 108 సిబ్బంది ఆ గ్రామానికి చేరుకుని గర్భిణిని తీసుకుని మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ, పైలెట్ నరసింహమూర్తి, మహేష్ వాహనంలోనే ఆమెకు కాన్పు చేశారు. పండంటి ఆడపాపకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను పీహెచ్‌సీకి చేర్చారు.

అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలి

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'స్పందన'లో అందే అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలని, ఇందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 76 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. గడువు ముగిసినా పరిష్కారం కాని అర్జీలు 12 ఉన్నాయని, వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి

స్పందన కార్యక్రమం అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమంలో వచ్చిన క్లెయిమ్‌లన్నీ క్షుణ్ణంగా పరిశీలించి రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఓటరు సర్వే, క్లెయిమ్‌ల పరిష్కారం, రీ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. ఒకే ఇంట్లో పది మంది ఓటర్లు ఉన్నా, వందేళ్ల పైబడి వయస్సు ఉన్న ఓటర్లపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని విషయాలపై నియోజక వర్గ అధికారులు, ఎన్నికల డీటీలు పర్యవేక్షణ ఉండాలని, అంతిమంగా తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు.

'జగనన్నకు చెబుదాం'నిరంతరం కొనసాగాలి

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిరంతరంగా కొనసాగాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఇక నుంచి మండల కేంద్రాల్లో ఏర్పాట చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీ నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం, 15న ఓడీ చెరువు, 22న కొత్తచెరువు, 27న బుక్కపట్నం, 29న పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయాల వద్ద కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి తగిన నివేదికలతో తప్పక హాజరు కావాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, జౌళిశాఖ ఏడీ రమేష్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సర్వే అండ్ ల్యాండ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని...

- బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండాకు రోడ్డు సౌకర్యం, సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయాలని పలువురు బంజారా నాయకులు కలెక్టర్‌కు విన్నపించారు. సెల్ టవర్ లేక సమాచారం అందడం లేదని బంజారా నాయకులు చక్రీ నాయక్, సుధాకర్ నాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.
- తన 2 సెంట్ల స్థలాన్ని తమ గ్రామానికే చెందిన బోయ వెంకటరమణప్ప ఆక్రమించుకున్నారని గోరంట్ల మండలం తిప్పరాజుపల్లికి చెందిన శివయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.
- మడకశిర మండలం ఛత్రం గ్రామ సర్వే నంబర్ 62–1లోని 2.55 ఎకరాల భూమిని ఇతరులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వెబ్ ల్యాండ్‌లో తనపేరును నమోదు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం అందజేయాలని వెంకటనారాయణ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకున్న క్రీడాకారులతో జాతీయ స్థాయి గ్రాప్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

పరిగి: జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. హర్యానాలోని రోహతక్‌లో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకూ గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ గ్రాప్లింగ్ కుస్తీ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏపీ తరఫున జిల్లాకు చెందిన 9 మంది క్రీడాకారులు అండర్ 13, 15 విభాగాల్లో తలపడ్డారు. వీరిలో శ్రీచరణ్, యాహియా, ధనుంజయ వెండి, సయ్యద్, మిలాన్‌కుమార్, ప్రణవ్, చందన కాంస్య పతకాలను సాధించారు. జాతీయ గ్రాప్లింగ్ రెజ్లింగ్ కమిటీ చైర్మన్ దినేష్‌కపూర్, జనరల్ సెక్రెటరీ బీర్జూశర్మ, ఏపీ చైర్మన్ సురేంద్రారెడ్డి చేతుల మీదుగా సోమవారం వారు పతకాలను అందుకున్నారు. కోచ్‌లు రమేష్, చరణ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటండి



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్: త్వరలో మహారాష్ట్ర వేదికగా జరిగే జాతీయస్థాయి అండర్–15 బాలికల చెస్ పోటీల్లో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ నాగార్జున కర్ణాటకమ్ పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుండి 10వ తేదీ వరకూ గుంతకల్లులోని పెంగ్విన్ యాక్టివిటీస్ క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 బాలికల ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో విశాఖకు చెందిన ప్రసాద్‌జాగృతి (మొదటి), తిరుపతికి చెందిన వి.త్రిపురాంబిక (ద్వితీయ), గుంటూరుకు చెందిన టి.శ్రీలాస్య (తృతీయ), వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన లాస్యశ్రీ మట్టం (నాల్గో) ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు రూ.30 వేల నగదు బహుమతులను అందజేశారు.

టీడీపీలో టికెట్ల బేరం

- 'తమ్ముళ్ల'ను వెంటాడుతున్న ఓటమి భయం
- పోటీ చేసేందుకు ముందుకు రాని నాయకులు
- చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నేతల్లో మరింత టెన్షన్
- బేరం కుదిరితే టికెట్ త్యాగానికి ఇన్‌చార్జ్‌లు సిద్ధం
- పెనుకొండ, ధర్మవరంలో రూ.కోట్లలో బేరసారాలు
- మడకశిరలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపని 'తమ్ముళ్లు'
- కదిరి, పుట్టపర్తిలో టికెట్ ఎవరికనే దానిపై స్పష్టత లేదాయె



సాక్షి, పుట్టపర్తి: అధినేత అరెస్టు కావడంతో 'తమ్ముళ్ల'లో వణుకు పుట్టింది. రాబోవు ఎన్నికల్లో గెలవలేమని ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు అందడంతో పోటీ చేయాలా? వద్దా? అనే సందేహంలో కొందరు సీనియర్ నాయకులు పడ్డారు. ఈ క్రమంలో బేరం కుదిరితే పొత్తుల పేరుతో జనసేన, కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులకు టికెట్ త్యాగం చేసేందుకూ వెనుకాడడం లేదు. ఇవే అంశాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మరికొన్ని చోట్ల టికెట్ ఆశిస్తున్న వారికే బాధ్యతలు ఇచ్చి తప్పుకోవాలని ప్రస్తుత ఇన్‌చార్జిలు భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీల్ కుదిరితే ఓకే..

ధర్మవరం, పెనుకొండ నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు నాయకులు ముందుకు రావడం లేదు. ఈ క్రమంలోనే ఆశావహుల మధ్య జరిగిన బేరసారాల్లో డీల్ కుదరక అయోమయంలో పడినట్లు సమాచారం. ఇన్నాళ్లు పెద్ద మొత్తంలో ఖర్చు చేశానని ఒకరు.. ఎన్నికల్లో ఖర్చు చేయాలని ఇంకొకరు.. బేరసారాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో పోటీ చేయడం కన్నా టికెట్‌లు అమ్మడం, కొనడం చేయడమే ఈజీగా ఉంటుందని 'తమ్ముళ్ల' మధ్య కొన్ని రోజులుగా సంభాషణ జోరుగా జరుగుతోంది. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ ఇన్‌చార్జిగా ఉన్నప్పటికీ పోటీ చేసేందుకు సుముఖంగా లేనట్లు సమాచారం. మరో వైపు వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ) ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారో తెలియని పరిస్థితి. పొత్తులో భాగంగా ధర్మవరాన్ని జనసేనకు కేటాయిస్తే తాను బరిలో ఉంటానని చిలకం మధుసూదన్‌రెడ్డి ఇప్పటికే ముమ్మర ప్రచారం చేసుకుంటున్నారు.

పోటీ చేయబోమంటూ..

ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన ఈరన్నను కాదని.. బీసీ వర్గానికి చెందిన గుండుమల తిప్పేస్వామికి నియోజకవర్గ బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎవరు పోటీ చేస్తారనే దానిపై స్పష్టత లేదు. గుండుమల తిప్పేస్వామి సూచించిన వారికి టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం ఒప్పుకోలేదనే వాదనలూ వినిపిస్తున్నాయి. మరోవైపు ఈరన్న కూడా తనకు టికెట్ వద్దని.. ఎవరు పోటీ చేసినా తనకు సంబంధం లేదని అనుచరుల వద్ద తేల్చి చెప్పినట్లు సమాచారం. పోటీ చేస్తే గెలుస్తామనే నమ్మకం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

స్పష్టత లేదాయె..

కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో టీడీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో కార్యకర్తలను కాపాడుకోవడంలో ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న నాయకులు విఫలం అవుతున్నారు. ఫలితంగా ఉన్న క్యాడర్ కూడా ఊడిపోయింది. చంద్రబాబు అరెస్టుతో ధర్నాలు, నిరసనలు తెలపాలన్న అధిష్టానం ఆదేశాలను ఈ రెండు నియోజకవర్గాల్లోని కార్యకర్తలు బేఖాతరు చేశారు. నాయకులు తప్ప కార్యకర్తలు రాకపోవడంతో టీడీపీ నేతల బలం తేలిపోయింది. దీంతో టీడీపీలో సెకండ్ క్యాడర్‌లో ఉన్న నాయకులు కూడా ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. టీడీపీలో కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదన్న భయం వారిని వెన్నాడుతోంది.

జత కట్టేదెవరితో?

వచ్చే ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తే గెలవలేమని టీడీపీ అధిష్టానం గట్టి నమ్మకంతో ఉంది. దీంతో కాంగ్రెస్ లేదా, జనసేనతో జత కట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం. దీంతో ఆ పార్టీలకు ఎన్ని సీట్లు ఇస్తారు? ఏయే స్థానాలు కట్టబెడతారు? అనే దానిపై పలు సందేహాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం టీడీపీ తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ఉన్నవారు పార్టీ బలోపేతానికి ఖర్చు చేసేందుకు ముందుకు రావడం లేదు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశించినా రోడ్డెక్కకుండా ఇంటికే పరిమితమవుతున్నారు.

బాబుకు జైలు భోజనమే పెట్టాలి

- ఇంటి భోజనం పెడితే మిగతా ఖైదీలు అదే డిమాండ్ చేస్తారు
- అవినీతి అనకొండకు ప్రత్యేక వసతులు కరెక్ట్ కాదు
- ఎంపీ గోరంట్ల మాధవ్



కదిరిలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

కదిరి: 'ప్రజాస్వామ్యంలో అవినీతికి పాల్పడిన వారు శిక్ష అనుభవించాల్సిందే. 'స్కిల్'స్కామ్‌లో చంద్రబాబు రూ.241 కోట్లు కొల్లగొట్టాడు. అందుకే ఆయనకు కోర్టు జైలుశిక్ష విధించింది. అయితే ఆయనకు తోటి ఖైదీలతో సమానంగా జైలు భోజనం పెట్టకుండా ఇంటి భోజనం పెట్టడాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నా. భవిష్యత్‌లో ఇంకొందరు ఖైదీలు కూడా తమకూ ఇంటి భోజనం తెప్పించండి అని డిమాండ్ చేయడంలో న్యాయం ఉంది కదా?' అని హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం ఆయన కదిరి రహదారులు, భవనాల అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబుకు తక్షణం జడ్ ప్లస్ భద్రత తొలగించాలన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని అవినీతి కేసుల్లో అరెస్ట్ కాకతప్పదన్నారు. చంద్రబాబు పాపం పండిందని, ఇన్నాళ్లు వ్యవస్థలను మ్యానేజ్ చేసుకుంటూ వచ్చారని, ఇక దేవుడు ఆయన్ను క్షమించరన్నారు. పోలీసులు చంద్రబాబును చట్టబద్ధంగానే అరెస్ట్ చేసి, జైలుకు పంపారని, ఇదే కేసులో కొందరు విదేశాలకు పారిపోయారంటేనే ఈ కేసు ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చన్నారు.

అవినీతి తేలడంతోనే అరెస్టు..

పూణేకు చెందిన ఒక సామాజిక కార్యకర్త ఫిర్యాదుతో బాబు 'స్కిల్'స్కాం వెలుగులోకి వచ్చిందని ఎంపీ గోరంట్ల మాధవ్ తెలిపారు. దీనిపై ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే కుంభకోణం బయట పడిందన్నారు. సీమెన్స్ ఎండీ సంతకాలు ఎంఓయూలో వేర్వేరుగా ఉండటంతో లోతైన విచారణ కోసం కేసు సీఐడీకి అప్పగించారన్నారు. ఇందులో ఏడు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.240 కోట్లు మెక్కాడని విచారణలో తేలిందని, అందుకే చంద్రబాబును జైలుకు పంపారన్నారు. చంద్రబాబుపై ఎప్పుడు ఏ అవినీతి ఆరోపణలు వచ్చినా కోర్టుకెళ్లి స్టే తెచ్చుకోవడం చూశామని, ఆయన చేసిన అవినీతి పనులకు జీవితాంతం జైలు జీవితం తప్పదన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజల నుంచి స్పందన కరువైందని టీడీపీ నాయకులే చెప్పుకుంటున్నారని ఎంపీ గుర్తు చేశారు.

ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగింది..

చంద్రబాబు అవినీతి కేసులో జైలుకు వెళ్లడంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరి ఉంటుందని హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్ అన్నారు. సోమవారం ఆయన కదిరిలో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, పిల్లనిచ్చిన పాపానికి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతున్ని చేసి ఆయన కుర్చీని పార్టీని లాక్కున్న ఘనుడు చంద్రబాబు అన్నారు. ఆ నాడు ఎన్టీఆర్ పడిన బాధ రాష్ట్ర ప్రజలందరూ కళ్లారా చూశారని ఎంపీ గుర్తు చేశారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు కూడా అప్పట్లో చంద్రబాబును ఎదిరించలేక ఆయనతో కలిసి పోయారని, బాబు ఇప్పుడు జైలుకెళ్లడంతో వారు కూడా సంతోషిస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు కోర్టు నమ్ముతూ ఆయన్ను జైలుకు పంపడాన్ని రాష్ట్ర ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. 74 ఏళ్ల వయస్సున్న ఎన్టీఆర్‌ను చంద్రబాబు ఘోరంగా అవమానించారని, ఇప్పుడు అదే 74 ఏళ్ల వయస్సులో చంద్రబాబు జైలుపాలు కావడం దేవుడు రాసిన స్క్రిప్ట్..అన్నారు. ఎన్టీఆర్ మరణానికి కారణమైన చంద్రబాబుకు గానీ, టీడీపీ నాయకులకు గానీ ఎన్టీఆర్ పేరు ఉచ్ఛరించడానికి కూడా అర్హత లేదన్నారు.

స్నేహితుడి భార్యను కాపాడబోయి..

అనంతపురం సిటీ: రైలు కిందపడబోతున్న స్నేహితుడి భార్యను కాపాడబోయి ఓ మిత్రుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌లోని ఆవాజ్‌పూర్‌కు చెందిన రక్షపాల్ (34), తన స్నేహితుడు మున్నాకుమార్, అతని భార్య హీరామతితో కలసి రాప్తాడు మండలం హంపాపురం వద్ద ఉన్న సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో దిన కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌కు మున్నాకుమార్, హీరామతి దంపతులను రైలు ఎక్కించేందుకు తోడుగా రక్షపాల్ అనంతపురంలోని రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఆదివారం రాత్రి 11.30 గంటలకు రైలు స్టేషన్‌కు చేరుకోగానే బోగిని వెతుక్కొని మున్నాకుమార్ ఎక్కేలోపే రైలు ముందుకు కదిలింది. ఆ సమయంలో హీరామతి రైలు ఎక్కే ప్రయత్నంలో కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు రైలుకు మధ్య ఇరుక్కుపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో రక్షపాల్ కూడా రైలు–ప్లాట్ ఫామ్ మధ్య ఇరుక్కుపోయాడు. బోగిలోని చైన్‌ను మున్నాకుమార్ లాగడంతో రైలు కొద్ది దూరం వెళ్లి ఆగింది. అప్పటికే హీరామతి కుడి పాదం తెగిపడింది. రక్షపాల్ తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు రక్షపాల్ మృతి చెందాడు. హీరామతిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. రక్షపాల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మోటార్ రివైండింగ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్‌పై అనంతపురంలోని ఎస్కేయూ వద్ద ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (రూడ్‌సెట్)లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.వి జయలక్ష్మి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 10 నుంచి 35 సంవత్సరాల్లోపు గ్రామీణ నిరుద్యోగ యువకులు అర్హులు. ఆసక్తి ఉన్నవారు 83099 15577 నంబర్‌లో సంప్రదించవచ్చు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



లక్ష్మీనారాయణరెడ్డి మృతదేహం

తాడిమర్రి: విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... దాడితోటకు చెందిన నోసం లక్ష్మీనారాయణరెడ్డి (63) సోమవారం ఉదయం 6.30 గంటలకు తన వరి మడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు తీగలను 11కేవీ విద్యుత్ తీగలకు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కుప్పకూలి పోయాడు. విషయాన్ని గమనించిన పక్క తోటలోని రైతులు వెంటనే అక్కడకు చేరుకుని సపర్యలు చేసి, చికిత్స కోసం తాడిమర్రి పీహెచ్‌సీకి తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతునికి భార్య నారాయణమ్మ, కుమారుడు సంజీవరెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. అంగవైకల్యాన్ని భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకోగా, జీవితంపై విరక్తితో మరో ఇద్దరు ఉరి వేసుకుని మృతి చెందారు. వివరాలు...

ధర్మవరం: ధర్మవరానికి చెందిన రామాంజనేయులు (30) మగ్గాలకు జాకార్డుల పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం ఇన్‌ఫెక్షన్ సోకడంతో శస్త్రచికిత్స చేసి కాలును వైద్యులు తొలగించారు. అప్పటి నుంచి అంగవైకల్యాన్ని భరించలేక తీవ్ర మనోవేదనతో కొట్టుమిట్టాడుతున్న రామాంజనేయులు జీవితంపై విరక్తితో సోమవారం తెల్లవారుజామున ధర్మవరంలోని ప్యాదిండి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

- **పుట్టపర్తి అర్బన్:** అమడగూరు మండలం కొట్టువారిపల్లికి చెందిన సురేంద్రనాయక్ (27) తల్లి లక్ష్మీదేవితో కలసి కొన్నేళ్ల క్రితం పుట్టపర్తి మండలం ప్రశాంతి గ్రామానికి వలస వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం సాయంత్రం ఫైర్ ఆఫీస్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ దాదాపీర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.
- **గుడిబండ:** మండలంలోని కూగీరనపాళ్యం గ్రామానికి చెందిన మసియన్న(34) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గొర్రెల కాపరిగా జీవనం సాగించే మసియన్న జీవితంపై విరక్తితో సోమవారం ఉదయం భూతప్ప కనుమలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మసియన్న ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజునాయక్

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. పుట్టపర్తి మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో అక్టోబర్ 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, వివరాలను సర్వే ప్రక్రియ అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించే వైద్యాధికారులకు అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి అక్టోబర్ 3వ తేదీ జగరాజుపల్లి, 4న అమగొండపాళ్యం, 5న నిడిమామిడి, 6న దిగువచెర్లోపల్లి, 7న పెడపల్లి–1, 10వ తేదీ చెర్లోపల్లి, 11న పెడపల్లి–2, 12న రాచువారిపల్లి, 13వ తేదీ వెంకటగారిపల్లి సచివాలయాల పరిధిలో సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్, వైద్యాధికారి నాగరాజునాయక్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను(సీఐ) బదిలీ చేస్తూ సోమవారం రాత్రి అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తి అర్బన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న బాలసుబ్రమణ్యంరెడ్డిని వీఆర్‌కు పంపగా, అనంతపురం ఎస్పీ వద్ద వీఆర్‌లో ఉన్న కొండారెడ్డిని పుట్టపర్తి అర్బన్ సీఐగా బదిలీ చేశారు. అలాగే కదిరి రూరల్ సీఐగా పని చేస్తున్న శంకర్‌నాయక్‌ను వీఆర్‌కు పంపి, ఆయన స్థానంలో అనంతపురంలో వీఆర్‌లో ఉన్న గాండ్ల వెంకటేష్‌ను కదిరి రూరల్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతల దాడి

బత్తలపల్లి: మండలంలోని నెత్తివారంపల్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపిన మేరకు.... గ్రామానికి చెందిన నరేంద్రప్రసాద్ బెంగుళూరులో మెకానిక్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో చంద్రబాబు అరెస్ట్‌పై సోషల్ మీడియాలో నరేంద్రప్రసాద్ చేసిన పోస్టులు తొలగించాలని కుటుంబసభ్యులను, వదిన కుమారి (వలంటీర్)ని టీడీపీ నాయకులు ఆనంద్, నాగభూషణ, బాలనరసింహులు, మరో వ్యక్తి బెదిరించారు. విషయం తెలుసుకున్న నరేంద్ర ప్రసాద్ ఆదివారం గ్రామానికి చేరుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు మూకుమ్మడిగా నరేంద్రప్రసాద్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

వైభవంగా దొణగంగమ్మ జాతర



దొణ వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుమ్మఘట్ట (రాయదుర్గం రూరల్): రాయదుర్గం మండలం టీ.వీరాపురం సమీపంలో వెలసిన దొణగంగమ్మ జాతరకు జనం పోటెత్తారు. శ్రావణ మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని దొణ గంగమ్మను జలధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి వేలాది భక్తుల సమక్షంలో దొణ వరకూ లాగారు. సాయంత్రం తిరిగి గమ్యస్థానానికి చేర్చారు. అమ్మవారిని దర్శించేందుకు కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. దొణ చుట్టూ వృషభాలతో ప్రదక్షణలు చేయించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి, ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి జాతరలో పాల్గొని అమ్మవారి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు హొన్నే మల్లికార్జున, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, మాజీ ఎంపీపీ భారతి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ప్రకాష్, మహేష్, అంజినయ్య, వార్డు సభ్యుడు శంకర్, ఈడిగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.